క్లుప్తంగా

నూతన అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



బాన్సువాడ రూరల్‌: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్‌కాలనీ, బండాగల్లి, మిస్రీగల్లీ, మదీనాకాలనీ, ఇస్లాంపుర తదితర ప్రాంతాల్లో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈమేరకు వారు శనివారం పట్టణంలోని సబ్‌కలెక్టర్‌ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. మాజీ వార్డు సభ్యుడు, సోషల్‌ వర్కర్‌ షేఖ్‌ అక్బర్‌, పలువురు కాంగ్రెస్‌ పార్టీ నాయకులు లాయఖ్‌, అంబర్‌సింగ్‌, రహీమ్‌, అబ్దుల్‌ ఖాదర్‌, ఇర్ఫాన్‌ ఖురేషీ, అక్రమ్‌ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల మంజూరుచేయాలి



కామారెడ్డి రూరల్‌: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో పశువుల ఆస్పత్రి మంజూరు చేయాలని, పశువైద్యాధికారిని నియమించాలని గ్రామానికి చెందిన పాడి రైతులు కోరారు. వారు శనివారం ఎంపీడీవో నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. పశువైద్యశాల లేకపోవడంతో పశువులకు వైద్య చేయించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి, సమస్యను పరిష్కరించాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీవో మన్నె ప్రభాకర్‌ పరిశీలించారు. భోజనాన్ని తిని, రుచి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్‌ మహేందర్‌, ప్రిన్సిపాల్‌ మాణిక్యం తదితరులున్నారు.

పట్టపగలూ వీధిదీపాల వెలుగులు



ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో హైమాస్ట్‌ లైట్లు పగలు కూడా వెలుగుతున్నాయి. గ్రామంలో ఇటీవల లైట్లు పాడవడంతో కొత్తవాటిని అమర్చారు. కానీ రాత్రి వెలగాల్సిన లైట్లను సిబ్బంది నిర్లక్ష్యంతో 24 గంటలపాటు వెలుగుతున్నాయి. దీంతో అవి మళ్లీ పాడయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లైట్లు ఆన్‌ ఆఫ్‌ చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ బూత్‌ కమిటీల ఎన్నిక



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీజేపీ బూత్‌ కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మండలంలోని మోడెగాం గ్రామంలో 58వ బూత్‌ నంబర్‌కు రమేశ్‌రెడ్డిని నియమించినట్లు ఆయన తెలిపారు. నాయకులు చక్రధర్‌గౌడ్‌, లోకుల వెంకటేశ్‌, రాంరెడ్డి, నరేందర్‌, సాయిలు, జైపాల్‌రెడ్డి, గంగాధర్‌రావు ఉన్నారు.

తాడ్వాయి మండలంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంతాయిపేట్‌ గ్రామంలో శనివారం నూతనంగా బీజేపీ బూత్‌ కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి బూత్‌కమిటీ అధ్యక్షుడు మహేందర్‌ను సన్మానించారు. నాయకులు పత్తి రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో సయ్యద్‌ సాజీద్‌ అలీ అన్నారు. మండలంలోని కాలోజివాడి గ్రామంలో శనివారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. సేకరించిన వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. సూపరింటెండెంట్‌ హన్మండ్లు, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడి మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు వన్నెపల్లి రాజు(55) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

సాగుకు భరోసా

- నిజాంసాగర్‌ ప్రధాన కాలువకు నీటి విడుదల
- ఆయకట్టు కింద జోరందుకున్న నారుమళ్లు
- వ్యవసాయ పనుల్లో రైతన్నల బిజీ



తుంకిపల్లి తండా వద్ద నారుమడి కోసం దుక్కిని చదును చేస్తున్న రైతు

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఉమ్మడి జిల్లా వరప్రదాయని నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల చేపట్టడంతో ఆయకట్టు కింద ముందస్తు పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధం అయ్యారు. నిజాంసాగర్‌, మహమ్మద్‌నగర్‌, బాన్సువాడ మండలాల్లోని మొదటి ఆయకట్టు ప్రాంత రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. బీర్కూర్‌, నస్రుల్లాబాద్‌, వర్ని, మోస్రా, చందూర్‌, ఎడపల్లి, బోధన్‌ మండలాల్లోని ఆయకట్టు ప్రాంత రైతులు వరినాట్లకు శ్రీకారం చుట్టారు.

ఆరు విడతలు.. 10.8 టీఎంసీలు

వర్షాకాలం ఆరంభం నుంచి నవంబర్‌ వరకు వర్షాలు సమృద్ధిగా కురవడంతో నిజాంసాగర్‌ ప్రాజెక్టు 1405 అడుగుల మేర 17.8 టీఎంసీల పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది. ఆయకట్టు కింద వానాకాలం పంటలు గట్టెక్కడంతో యాసంగి పంటలకు సాగర్‌ భరోసా నిస్తోంది. ఆయకట్టు కింద 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అంచనా వేస్తూ 10.8టీఎంసీల నీటి విడుదలకు నీటిపారుదలశాఖ అధికారులు ఇటీవల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఆరు విడతల్లో 10.8 టీఎంసీల నీటిని ఆన్‌, ఆఫ్‌ పద్ధతిన ఆయకట్టు పంటలకు అందించనున్నారు.



ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న ప్రాజెక్టు జలాలు

ముందస్తు సాగు..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిజాంసాగర్‌ ప్రాజెక్టు ఆయకట్టు కింద వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తు పంటలు సాగు చేస్తున్నారు. వానాకాలంలో జూన్‌ నెలలో, యాసంగికి డిసెంబర్‌ నెలలో ముందస్తుగా సాగర్‌ జలాలు అందిస్తుండటంతో పంటల సాగు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్‌ ప్రాజెక్టు కింద జుక్కల్‌ నియోజక వర్గంలో 3,780 ఎకరాలు, బాన్సువాడ నియోజకవర్గంలో 78,066 ఎకరాలు, బోధన్‌ నియోజకవర్గంలో 43,725 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. మొదటి డిస్ట్రిబ్యూటరి నుంచి 49వ డిస్ట్రిబ్యూటరి అలీసాగర్‌ రిజర్వాయర్‌ వరకు సాగర్‌ ప్రాజెక్టు జలాలను అందిస్తున్నారు.

పంటల సాగుకు ఢోకా లేదు..



నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలతో ఆయకట్టు కింద పంటల సాగుకు ఢోకా లేదు. జుక్కల్‌ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చొరవతో నిజాంసాగర్‌ ప్రాజెక్టు నీటిని విడుదల చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు రుణపడి ఉంటాం.

– కుమ్మరి రాములు, రైతు, తుంకిపల్లి

నారు మడ్లు వేసుకుంటున్నాం



మొదటి ఆయకట్టుకు ప్రధాన కాలువ నీరు జీవనాధారం. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆయకట్టు కింద నారుమడ్లు వేసుకుంటున్నాం. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందనుండటంతో వరి పంటల సాగుకు ప్రాధాన్యత ఇచ్చాం.

– చాకలి భూమయ్య, రైతు, కొమలంచ

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి





శెట్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు.. లింగారెడ్డిపేటలో..

సాక్షి నెట్‌వర్క్‌: తల్లిదండ్రులు తమ పిల్లలకు నిత్యం పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సూచించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ బడుల్లో శనివారం 'తెలంగాణ ఆహారోత్సవం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు అందించే ఆహారంలో పిండిపదార్థాలు, విటమిన్స్‌, చిరుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి, పాఠశాలల్లో ప్రదర్శించారు. వాటిలోని పోషకాల గురించి ఉపాధ్యాయులు వివరించారు.



తుజాల్‌పూర్‌లో ప్రాథమిక పాఠశాలలో..



మాసాన్‌పల్లిలో..



దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

ఉన్నత స్థానాలకు ఎదగాలి

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంపీడీవో సంతోష్‌ కుమార్‌ సూచించారు. మండలంలోని మర్కల్‌ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ ఉదయిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలి



దోమకొండలో మెడిటేషన్‌ చేస్తున్న విద్యార్థులు



నిజాంసాగర్‌ సబ్‌ సెంటర్‌లో..

సాక్షి నెట్‌వర్క్‌: ప్రతిఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలని ధ్యాన శిక్షకులు సూచించారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, బడుల్లో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ధ్యానం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రతి మనిషి రోజుకు గంటపాటు ధ్యానం చేయడం వల్ల జీవితం ఆనందకరంగా ఉంటుందని అన్నారు. పలు మండలాల్లో యోగాసనాలు సైతం చేయించారు.



బీబీపేటలో..



దేమికలాన్‌లో..

ఘనంగా గణిత దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్‌: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శనివారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో రామానుజన్‌ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలు బడుల్లో గణితశాస్త్ర వస్తువుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ఆయా వస్తువులు ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులకు గణితం క్విజ్‌, ఉపన్యాసం, వ్యాసరచన, గణిత మేళా వంటి పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రామానుజన్‌ సంఖ్య 1729 ఆకారంలో పలువురు విద్యార్థులు కూర్చొని, వేడుకలు జరుపుకున్నారు.



జంగంపల్లి ఎంజేపీ విద్యాలయంలో..



చిన్నకొడప్‌గల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ప్రదర్శన



పెద్దకొడప్‌గల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో..



వడల్‌పర్తిలో 1729 ఆకారంలో విద్యార్థులు



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో..



గోపాల్‌పేట్‌లో..

మున్నూరుకాపు యూత్‌కమిటీ..

నిజాంసాగర్‌(జుక్కల్‌): జుక్కల్‌ మండల మున్నూరుకాపు యూత్‌ కమిటీని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్‌ అధ్యక్షుడిగా లాడేగావ్‌ గ్రామానికి చెందిన పేరిశెట్టి శ్రీనివాస్‌, ఉపాధ్యక్షులుగా పాకలి పవన్‌, కోశాధికారిగా శ్రీకాంత్‌, సోషల్‌ మీడియా కన్వీనర్‌గా నవీన్‌ ఎన్నికయ్యారు. అలాగే 11మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మున్నూరుకాపు సంఘం..



మాచారెడ్డి: మాచారెడ్డి, పాల్వంచ మండలాల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌ రావు ఆధ్వర్యంలో శనివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా స్వామి,

నూతన కార్యవర్గాల ఎన్నిక..

ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌, వెంకన్న కార్యదర్శిగా దేవరాజుతోపాటు మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. పాల్వంచ అధ్యక్షుడిగా నల్లల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా రాములు, కార్యదర్శులుగా నర్సింలు, తిరుపతితోపాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్‌ కమిటీ..



మాచారెడ్డి: మండలంలోని రత్నగిరిపల్లి, ఘన్‌పూర్‌ ఎమ్మార్పీఎస్‌ గ్రామాల నూతన కార్యవర్గాలను శనివారం మండల శాఖ అధ్యక్షుడు బట్టి రమేష్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రత్నగిరిపల్లి అధ్యక్షుడిగా రమేష్‌, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్‌, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీరాజం, కోశాధికారిగా శంకర్‌, గౌరవ అధ్యక్షుడిగా నర్సయ్యను ఎన్నుకున్నారు. ఘన్‌పూర్‌ అధ్యక్షుడిగా సతీష్‌, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్‌, సోషల్‌ మీడియా అధ్యక్షుడిగా కిషోర్‌, గౌరవ అధ్యక్షుడిగా వెంకట్‌ ఎన్నికయ్యారు.

టీజీవో రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



కామారెడ్డి అర్బన్‌: తెలంగాణ గెజిటెడ్‌ ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి టీజీవో రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌ నాంపల్లిలోని టీజీవో భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌ పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, కిషన్‌, అమృత్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్‌ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కల్యాణం జరిపించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచి పెట్టారు. ఈవో శ్రీధర్‌రావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పరందామాచార్యులు, సిబ్బంది ఉన్నారు.

త్రిలింగేశ్వరాలయంలో డీఆర్‌డీవో పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌ గ్రామశివారులోగల త్రిలింగేశ్వరాలయాన్ని శనివారం డీఆర్‌డీవో సురేందర్‌ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశేషతలను ఆలయకమిటీ సభ్యులు డీఆర్‌డీవోకు వివరించారు. ఆలయ కమిటీ చైర్మన్‌ దత్తు, డీపీఎం సుధాకర్‌ ఉన్నారు.

ప్రారంభమైన మల్లన్న ఉత్సవాలు



కామారెడ్డి రూరల్‌: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో శనివారం మల్లన్న ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మైల తీసే కార్యక్రమం నిర్వహించారు. నేడు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

క్రీడాకారులకు సన్మానం



నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌ నగర్‌ మండలం సర్వ గ్రామానికి చెందిన క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపారు. దీంతో పలువురు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా వారిని గ్రామస్తులు శనివారం సన్మానించారు. మాజీ సర్పంచ్‌ గొల్ల గోపాల్‌, నవీన్‌గౌడ్‌, భూమాగౌడ్‌, పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్‌ ప్రభాకర్‌ ఉన్నారు.

విద్యావేత్త తుకారామ్‌కు..



బాన్సువాడ: బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి రావడంతోపాటు అటానమస్‌ హోదా, అకాడమిక్‌ పర్యవేక్షకులుగా విద్యావేత్త డాక్టర్‌ తుకారామ్‌ నియమితులయ్యారు. ఈసందర్భంగా తుకారామ్‌ను శనివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వనం గంగాధర్‌, శ్రీనివాస్‌గౌడ్‌, జీవన్‌, హాజీ, శ్రీనివాస్‌, కొండ నారాయణ, పాషఖాన్‌ తదితరులు ఉన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

పిట్లం(జుక్కల్‌): మండలంలోని గౌరారం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ప్రతాప్‌ సింగ్‌, గౌస్‌లను ఎంఈవో దేవిసింగ్‌, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం శ్రీలత సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

అడిషనల్‌ కలెక్టర్‌ (రెవెన్యూ)ను కలిసిన టీఎన్‌జీవోలు



కామారెడ్డి అర్బన్‌: జిల్లాకేంద్రంలోని అడిషనల్‌ కలెక్టర్‌(రెవెన్యూ)విక్టర్‌ను శనివారం టీఎన్‌జీవోస్‌ జిల్లా కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ముల్క నాగరాజు, చక్రధర్‌, దేవరాజు, సహా జిల్లా ప్రతినిధులను ఆయన అభినందించారు. శ్రావణకుమార్‌, రాజ్యలక్ష్మి, అబ్దుల్‌ ఖాదీర్‌, రాజమణి, సాయినాథ్‌, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

రామారెడ్డి: రామారెడ్డి ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌, సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్‌తో పాటు బ్యాగులను రిటైర్డ్‌ ఉపాధ్యాయుడు కట్ట ఈశ్వర్‌కుమార్‌ అందజేశాడు. ఎంఈవో ఆనంద్‌రావు, హెచ్‌ఎం గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్‌లో వైద్యశిబిరం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లో శనివారం గ్రామానికి చెందిన అడ్వకేట్‌ భూమ రవిగౌడ్‌ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్‌ సొసైటీ, లయన్స్‌క్లబ్‌తోపాటు మెడిసిటీ హాస్పిటల్‌ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్‌ శిబిరాన్ని ప్రారంభించారు. పలువురిరి వైద్యులు వైద్యపరీక్షలు జరిపి, మందులను అందజేశారు. కిష్టయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

బోధన సామగ్రి అందజేత

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లి, మల్లుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన బోధన సామగ్రిని శనివారం కాంటిజెంట్‌ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ వలంటీర్లు అందజేశారు. రేవంత్‌రెడ్డి, నికిత, ఎల్లం నాయుడు, లికిత్‌, విక్రమ్‌ ఉన్నారు.

కష్కాలవ్వ ఆలయానికి విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని కష్కాలవ్వ ఆలయ పునర్నిర్మాణానికి మాజీ సీడీసీ చైర్మన్‌ ఐరేని నర్సయ్య శనివారం రూ.21వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కూర చంద్రం, లోలపు రవి, కంశెట్టి నర్సింలు కూర రామచంద్రం, నవీన్‌, లోలకు వెంకటి, పరశురాములు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయానికి రూ.66వేల విరాళం



కామారెడ్డి రూరల్‌: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని ఇల్చిపూర్‌ సరస్వతి మహాక్షేత్రంలో శనివారం ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డికి చెందిన అల్యాల ఉమాపతి–గీతాబాయ్‌లు రూ.66,232 విరాళాన్ని అందజేశారు. దాతలను ఆలయ నిర్మాణదాత పార్శి విఠల్‌ పటేల్‌ సన్మానించారు. అర్చకులు దత్తురావు, విజయ్‌పాండే, ప్రమోషాశ్రీ, భక్తులు కోలాల సిద్దాగౌడ్‌, మహేష్‌, రాములు, రొండ్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.